క్లుప్తంగా

రోగుల కోసం కుర్చీల ఏర్పాటు

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో వైద్యపరీక్షల కోసం వస్తున్న రోగుల కోసం కుర్చీలు ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ బ్లాక్‌లో వైద్యపరీక్షల కోసం వచ్చిన రోగులు, వారి సహాయకులు కూర్చోవడానికి కుర్చీలు లేక ఎక్కువసేపు నిలబడి ఉంటున్నారని తెలుసుకున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి ఆ దిశగా చర్యలు చేపట్టారు. అలాగే రోగులను ఎక్కువసేపు వేచి ఉండేటట్లు చేయకుండా త్వరగా రిపోర్ట్‌లు ఇవ్వాలని ల్యాబ్ సిబ్బందిని ఆయన ఆదేశించారు.

మైనార్టీ విద్యాసంస్థలకు స్థలాల పరిశీలన

కర్నూలు (అర్బన్) : జిల్లాలో మైనార్టీ విద్యాసంస్థలు ఏర్పాటు చేసేందుకు స్థలాలను పరిశీలించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. శనివారం సాయంత్రం ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజినీర్లు మంత్రి భరత్‌ను కలసి విద్యాసంస్థల ఏర్పాటుకు సంబంధించిన విషయాలను వివరించారు. 60:40 నిష్పత్తిలో పీజీ విద్యార్థుల హాస్టల్, కామన్ సర్వీస్ సెంటర్, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు స్థలాలు అన్వేషించాల్సి ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలోనే మంత్రి వెంటనే ఆయా విద్యాసంస్థలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రిని కలసిన వారిలో ఈఈ ఎం.లక్ష్మీనారాయణ, డీఈఈ గోన నాగరాజు, ఏఈలు రఘు, మధుమోహన్, బాషా, సురేంద్ర కుమార్, వెంకటరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

విజిలెన్స్ ఏడీ సేవలు ప్రశంసనీయం

కర్నూలు (టౌన్) : గనుల శాఖలో విజిలెన్స్ సహాయ సంచాలకుడిగా పనిచేస్తున్న బైరాగి నాయుడు సేవలు ప్రశంసనీయమని శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక కొత్తబస్టాండ్‌లోని ఒక హోటల్‌లో పదవీ విరమణ చెందిన విజిలెన్స్ ఏడీకి ఘనంగా సన్మానం చేశారు.

మంత్రిని కలిసిన పీఆర్ టీయూ నాయకులు

కర్నూలు సిటీ: మంత్రి టీజీ భరత్‌ను శనివారం పీఆర్‌టీయూ జిల్లా నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కరుణానిధిమూర్తి మాట్లాడుతూ జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వి కృష్ణారెడ్డి, ఎస్.రామకృష్ణ ఉన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకూడదు

- పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించండి
- ఇరిగేషన్ అధికారులతో మంత్రి టీజీ భరత్



ఇరిగేషన్ అధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(సెంట్రల్): నగరంలో తాగునీటి ఎద్దడి తలెత్తకూడదని...ఇందుకు అవసరమైన మార్గాలను అన్వేషించి నివేదికలు సమర్పించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో మంత్రి ఇరిగేషన్ అధికారులతో సమావేశమై కర్నూలులో నీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ..రాబోయే రోజుల్లో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి నెలకొనకూడదన్నారు. ఇందుకోసం ప్రస్తుతం ఉన్న నీటి వనరులను వినియోగించుకుంటూ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. త్వరలో జిల్లాలోని తాగు, సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష ఉంటుందని, ఇందుకు సిద్ధం కావాలని ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖరరెడ్డిని ఆదేశించారు. వెంటనే కేసీ కెనాల్, హంద్రీనదిలలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించాలన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ మెరుగు పడాలి

నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగు పడాలని మంత్రి టీజీ భరత్ శానిటేషన్ అధికారులను ఆదేశించారు. జగన్నాథగట్టుపై ఉన్న టిడ్కో గృహాల్లో మౌలిక వసతులను కల్పించాలని ఆదేశించారు. శనివారం ఆయన రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో టిడ్కో, శానిటేషన్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తరచూ డ్రెయినేజీలను శుభ్రం చేయాలని, కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తీసి వేయించాలన్నారు. తమ ఫ్యాక్టరీ నుంచి ఉచితంగా హైపో ద్రావణాన్ని తీసుకొని వీధుల్లో పిచికారీ చేయించాలన్నారు. పారిశుద్ధ్య విభాగంలో సిబ్బంది, నిధుల కొరత ఉందని అధికారులు చెప్పడంతో మునిసిపల్ కమిషనర్‌కు తో మాట్లాడి పరిష్కరిస్తానని మంత్రి వివరించారు. మరోవైపు కర్నూలు నగరానికి 10వేల టిడ్కో గృహాలు మంజూరయ్యాయని, అర్హుల వివరాలను వార్డుల వారీగా తనకు నివేదిక రూపంలో అందించాలన్నారు.కార్యక్రమంలో టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, మునిసిపల్ ఎంహెచ్ఓ విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

మైనార్టీ హాస్టల్ ఏర్పాటుకు సాధ్యసాధ్యాలు పరిశీలించండి

నగరానికి దూరంగా ఉన్న మైనార్టీ హాస్టల్‌ను కర్నూలులో ఏర్పాటు చేసేందుకు సాధ్యసాధ్యాలను పరిశీలించాలని మంత్రి భరత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ప్రభుత్వ అతిథి గృహంలో సమగ్ర శిక్షణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో ఉన్న పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు గోడలు ఏ మాత్రం ప్రమాదకరంగా ఉన్నా వెంటనే మరమ్మతులు చేయాలన్నారు.

ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరిస్తా

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ ఆసుపత్రిలో తిష్ట వేసిన సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసర విభాగంతో పాటు డయాగ్నోస్టిక్ బ్లాక్, చిన్నపిల్లల విభాగం, ప్రసూతి విభాగాలను పరిశీలించారు. అక్కడున్న రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఆసుపత్రిలో విద్యుత్ కోతలు లేకుండా ఉండేందుకు తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ బాగాలేదని, చెత్తబుట్టలు ఏర్పాటు చేసి అంటువ్యాధులు రాకుండా పిచికారీ చేయాలని సూచించారు. చిన్నపిల్లల ఐసీయూ విభాగంలో ఏసీలు పనిచేయడం లేదన్నారు. రోగులకు మంచినీరు అందించాలన్న ఉద్దేశంతో తమ టీజీవీ సంస్థల తరుపున ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేశామని, అయితే నిర్వహణ లేక రోగులకు నీరు అందడం లేదన్నారు. అలాగే ఆసుపత్రిలో ఎలుకల నివారణకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. డయాగ్నోస్టిక్ బ్లాక్‌లోని సీటీ స్కాన్‌లో ఎక్కువ స్కాన్‌లు చేయాలని చెప్పారు. చిన్నపిల్లల విభాగం అపరిశుభ్రంగా ఉందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.



ఆసుపత్రి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

ఆర్‌యూ రిజిస్ట్రార్ రాజీనామా

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న తన పదవికి రాజీనామా చేశారు. వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్‌కుమార్‌కు తన రాజీనామా లేఖను పంపారు. వైఎస్సార్ కడప జిల్లా యోగివేమన విశ్వవిద్యాలయం ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ అయిన ఈయన ఫిబ్రవరి 12వ తేదీ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించి నాలుగు నెలలు విధులు నిర్వహించారు. రాజీనామాను ఆమోదించిన వీసీ వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లును ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

కర్నూలు సిటీ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం కర్నూలు మండల పరిషత్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తిరుమలేష్, ఉపాధ్యక్షుడిగా మధు శేఖర్, సెక్రటరీగా రాముడు, జాయింట్ సెక్రటరీలుగా బి.సుధాకర్, బి.వి.జి వెంకటేష్, ట్రెజరర్‌గా బషీర్ అహ్మద్, లీగల్ అడ్వైజర్లుగా అయ్యస్వామి, చిన్న ఉశేన్‌లను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నట్లు ఆ అసోసియేషన్ గౌరవ సలహాదారులు నాగేశ్వర్ రెడ్డి, గిడ్డయ్య, గౌస్ మొహిద్దీన్‌లు తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ఉపాధి హామీ పథకం పీడీ అమర్నాథ్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

స్విమ్మింగ్‌పూల్ ఆకస్మిక తనిఖీ

కర్నూలు కల్చరల్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నగరంలోని స్విమ్మింగ్‌పూల్‌ను శనివారం జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.భూపతి రావు ఆకస్మిక తనిఖీ చేశారు. విధుల్లో రికార్డు అసిస్టెంట్ శివప్రసాద్, వాచ్‌మెన్ శంకర్, లైఫ్ గార్డ్ రఘు, భాస్కర్ తప్ప మిగతా వారు విధులకు గైర్హాజరైనట్లు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారందరికీ మెమోలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్టీఆర్ జీవిత చరిత్ర వ్యాసాల సంపుటి ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: ఎన్టీఆర్ జీవిత చరిత్రపై రచించిన 108 చరిత్ర వ్యాసాల సంపుటిని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ శనివారం ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ వ్యాస సంపుటిలో కర్నూలుకు చెందిన సాహితీ వేత్తలు పత్తి ఓబులయ్య, చంద్రశేఖర్ కల్కూర, అజీజ్ రచించిన వ్యాసాలు ఉన్నాయి. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ రామారావు ఆదర్శప్రాయులు అన్నారు. అనంతరం పత్తి ఓబులయ్య రచించిన తెలుగు భోజుడు గ్రంథాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త కె.చంద్రశేఖర్, రచయిత ఎస్‌డీవీ అజీజ్, కళాక్షేత్రం ఉపాధ్యక్షులు సంగా ఆంజనేయులు, రంగస్థలం నటులు గాండ్ల లక్ష్మన్న పాల్గొన్నారు.

పదవీ విరమణ తప్పనిసరి

కర్నూలు (టౌన్): ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని నగరపాలక కమిషనర్ భార్గవతేజ అన్నారు. శనివారం రాత్రి స్థానిక నగరపాలక సంస్థలోని కౌన్సిల్ హాల్‌లో ఇంజ/ నీరింగ్ విభాగం సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజినీర్ రాచయ్య పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎంఈ షాకీర్ హుసేన్, ఎంహెచ్ఓ విశ్వేశ్వరరెడ్డి, ఆర్ఓ జునైద్, వాజిద్, రాజు, మేనేజర్ చిన్న రాముడు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించి న్యాయం చేయండి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది తమకు జీతాలు చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వీరు రెండో రోజు శనివారం విధులు బహిష్కరించారు. వర్సిటీ ఇండోర్ స్టేడియం వద్ద సుమారు 30 మంది సిబ్బంది సమావేశమై తమ సమస్యలను చెప్పుకోడానికి వర్సిటీ వైస్‌చాన్సలర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న కోసం ఎదురు చూశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము వర్సిటీలో సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తున్నప్పటికీ జీతాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు మాంటిస్సోరికి చెందిన విద్యార్థి కె. పార్థచంద్ర ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయురాలు రమాజ్యోతి ఆ విద్యార్థినిని అభినందించారు.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా జరుగుతుందని చెప్పారు.

కల్లూరు సబ్‌రిజిస్ట్రార్‌గా ఎస్.నషీర్

కర్నూలు(సెంట్రల్): కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా ఎస్.నషీర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ పీపీ కల్యాణి ఉత్తర్వులు ఇచ్చారు. ఎస్.నషీర్ పులివెందుల జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ బదిలీపై కల్లూరుకు వస్తున్నారు. అక్కడ ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ హాజి మియ్యా తన పాత పోస్టు నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ ఆఫీస్‌లో రిపోర్టు చేసుకోవాల్సి ఉంటుంది.

పారిశ్రామిక కారిడార్లను పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్) : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పారిశ్రామిక కారిడార్లను పూర్తి చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో చంద్రబాబునాయుడు ఓర్వకల్ ఇండస్ట్రీయల్ హబ్, ఎమ్మిగనూరు టెక్స్‌టైల్స్ పార్కు, ఆదోని జిన్నింగ్ మిల్లు, పత్తికొండ, టమాట జ్యూస్ ఫ్యాక్టరీ, ఆలూరులో జింకల పార్కును ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే, నాడు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఈసారైనా వాటిని అమలుచేయడం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు పూలబొకే అందజేస్తున్న మునిసిపల్ కమిషనర్ భార్గవతేజ

కర్నూలు(సెంట్రల్): జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.రంజిత్‌బాషాకు అధికారులు, ప్రజాసంఘాల నాయకుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. రెండోరోజైనా శనివారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పాణ్యం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, జయసూర్య కలెక్టర్‌ను ఆయన చాంబరులో కలిసి మాట్లాడారు.సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాబురావు కలెక్టర్‌ను ఆయన చాంబరులో కలిసి బొకేలు అందజేశారు. టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరిచంద్రప్ప, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ అధ్యక్షుడు శ్రీరాములు, మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు యాట ఓబులేషు, ఏపీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్ర ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు, ఫొటో వీడియో జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి ఆధ్వర్యంలోని బృందాలు కలెక్టర్‌ను కలిసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

దాతల సహకారంతో మరుగుదొడ్ల మరమ్మతులు



అమర్చిన కొత్త బేషిన్

కర్నూలు(అర్బన్): నగరంలోని బీ క్యాంప్ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల నెంబర్: 1 వసతి గృహంలో దాతల సహకారంతో టాయ్‌లెట్లను మరమ్మతు చేయిస్తున్నట్లు వసతి గృహ సంక్షేమాధికారి బి. బెన్నమ్మ తెలిపారు. టాయిలెట్లకు సంబంధించిన బేషన్లు పగిలిపోవడం, కుళాయిల పైపుల లీకేజీ వల్ల విద్యార్థినులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ ఇబ్బందులను వైఎస్సార్ జిల్లాకు చెందిన ప్రతిభ బయోటెక్ ఫార్మా కంపెనీ లిమిటెడ్ అధినేత రాజశేఖర్‌రెడ్డికి తెలియజేశామన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన పరిస్థితిని అర్థం చేసుకొని రూ.25 వేలను అందించారన్నారు. ఈ సొమ్ముతో శనివారం నాలుగు టాయిలెట్లలో మరమ్మతు పనులు చేయించి బేషన్లను మార్చడం జరిగిందన్నారు. గత వారం రోజుల క్రితం ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కూడా రూ.25 వేలు విలువ చేసే ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను అందించారన్నారు. దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని, పేద, మధ్యతరగతి బాలికల వసతి గృహంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు మరికొందరు ముందుకు రావాలని ఆమె కోరారు.

10న కోర్కెల దినాన్ని జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): దేశవ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జూలై 10వ తేదీన నిర్వహించే కోర్కెల దినాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక కోర్కెలను తీర్చకపోవడంతోనే జూలై 10వ తేదీన కోర్కెల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోజుమండల కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈరన్న, నాగేశ్వరరావు, సాయిబాబా, విజయ్, ప్రభాకర్, నారాయణస్వామి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు స్పందించిన భవన యజమానులు

కర్నూలు (టౌన్): దీర్ఘకాలికంగా భవన అనుమతి ఫీజు చెల్లించని వారు లోక్ అదాలత్ నోటీసులకు స్పందించారు. స్థానిక సంతోష్‌నగర్ వద్ద ఉన్న లోక్ అదాలత్ కోర్టు ప్రాంగణంలో శనివారం నగర పాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు శిబిరం ఏర్పాటు చేశారు. బకాయి ఉన్న 23 మంది భవన యజమానులు మొత్తం రూ. 8 లక్షలు ఫీజులు చెల్లించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ ఏసీపీ రంగస్వామి మాట్లాడుతూ భవన అనుమతి ఫీజులు చెల్లించకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీపీ సంధ్య, ఏసీపీ శశికళ, బిల్డింగ్ పర్యవేక్షకులు మంజులమ్మ, శబరీష్, మస్రత్ ఆలీఖాన్, టౌన్ ప్లానింగ్ సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు

సీనియారిటీ ప్రాతిపదికన ఖాళీలు భర్తీ చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ శాఖలో పదవీ విరమణతో ఖాళీ అయిన పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఉపాధ్యక్షుడు పి.నాగరాజు కోరారు. ఈ మేరకు శనివారం ఆయన విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతిని కలసి వినతి పత్రం సమర్పించారు. పోస్టుల భర్తీలో గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలి

కర్నూలు(అర్బన్): జిల్లాలో అత్యధిక జనాభాగా ఉన్న కురువలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని జిల్లా కురువ సంఘం నేతలు కోరారు. శనివారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, కోశాధికారి కేసీ నాగన్న తదితరులు మంత్రి టీజీ భరత్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కురువ సామాజిక వర్గానికి సంబంధించి ఐదు లక్షల మంది ఓటర్లు ఉన్నా రాజకీయంగా సరైన ప్రాధాన్యత లేదన్నారు. మంత్రి టీజీని కలిసిన వారిలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి. వెంకటేశ్వర్లు, ధనుంజయుడు, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు టి. శ్రీలీల, కురువ అనితమ్మ, నాయకులు దేవేంద్ర, తిరుపాలు, పుల్లన్న, నాగయ్య, హరిదాసు, నాగేశేషులు తదితరులు ఉన్నారు.

క్లాప్ డ్రైవర్ల పెండింగ్ జీతాలు ఇప్పించాలి

కర్నూలు(సెంట్రల్) : కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్ల పెండింగ్ జీతాలు ఇప్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్ మంత్రి టీజీ భరత్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి కోరారు.

ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘానికి ఎన్నికలు నిర్వహించాలి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘానికి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని పలువురు ప్రభుత్వ వాహన డ్రైవర్లు రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావును కోరారు. శనివారం కర్నూలుకు వచ్చిన ఆయనకు ఈ మేరకు వినతి పత్రం సమర్పించి మాట్లాడారు. జిల్లాలో బైలా ప్రకారం ఎన్నికలు నిర్వహించడం లేదని, జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక అబద్ధమని వారు పేర్కొన్నారు. ప్రస్తుత అధ్యక్షుడు నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ వాహన డ్రైవర్లు ఎం.ఇలియాస్ బాష తదితరులు రాష్ట్ర అధ్యక్షుడికి విన్నవించిన వారిలో ఉన్నారు.

మాస్ మీడియా అధికారిణికి సన్మానం

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో మాస్ మీడియా అధికారిణిగా పనిచేస్తున్న ప్రమీలాదేవి పదవీ విరమణను పురస్కరించుకుని శనివారం సహ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రమీలాదేవి చేసిన సేవలను కొనియాడారు. 1986 ఏప్రిల్‌లో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బీఎస్సీ నర్సింగ్ స్టాఫ్‌నర్సుగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన ఆమె పీజీడీహెచ్ఈ, ఎన్ఫీల్డ్ సైకాలజి ఉన్నత విద్యలను అభ్యసించి ప్రాంతీయ శిక్షణ కేంద్రం (ఫిమేల్, మేల్)లలో విధులు నిర్వహించి శిక్షకురాలిగా అనేక మందిని ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని ఎస్ఏపీ క్యాంపు నుంచి జాతీయ రహదారిపై ఉన్న ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్ వరకు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు. ఎస్ఏపీ క్యాంపు నుంచి సంతోషనగర్ వరకు విద్యుత్ శాఖ 50 వరకు టవర్లు వేసిందని ఆయన పేర్కొన్నారు. దశల వారీగా టవర్స్‌పై విద్యుత్ లైన్ లాగుతున్నందున ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

డీఎస్ మరణం తీరని లోటు

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ సీనియర్ నేత ధర్మపురి శ్రీనివాస్ గుండెపోటుతో మరణించడం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.బాబురావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో డీఎస్ మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారన్నారు. 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించారన్నారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ ఉన్నారు.





